# 5

# రక్షణ గూర్చిన దేవుని నిత్య సంకల్పము

## (2:4-10)

ఎఫెసీయులు క్రీస్తునంగీకరించక మునుపు జీవించిన తీరును గూర్చిన నిరాశజనకమైన అనుస్మారకము నిచ్చిన తరువాత, పౌలు ఒక ప్రోత్సాహకరమైన సందేశాన్నిస్తున్నాడు. దేవుడు మానవుని రక్షణ కొరకు ఉద్దేశించిన ఆశ్చర్యకరమైన సంకల్పమును ఆయన వివరించాడు.

### ప్రేమలో గల ఉద్దేశము (2:4)

**[4]అయినను దేవుడు, కరుణాసంపన్నుడైయుండి, ... తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను.**

**వచనము 4.** ఎఫెసీయులు పాపముల చేత చచ్చినవారై, శరీరాశలను అనుసరిస్తూ జీవించుచుండిరని ఘోషించిన పిదప, "అయినను దేవుడు" అను మాటలతో పౌలు ఒక గొప్ప నిరీక్షణను మరియు ఆదరణను వారి ముందుంచాడు. **అయినను దేవుడు, కరుణాసంపన్నుడై యుండి, ... తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెనని** ఆయన రచించాడు.

దేవుడు నిరపేక్షముగా పరిశుద్ధుడు. ఆయన గతకాలమందలి ఇశ్రాయేలీయులకు "నేను పరిశుద్ధుడను" అని ప్రకటించాడు, ప్రస్తుతమున్న మనకును ప్రకటిస్తున్నాడు (లేవీయకాండము 11:44, 45; 19:2; 20:26; 1 పేతురు 1:16 చూడుము). దేవుడు పరిశుద్ధుడు గనుక, ఆయనకు పాపముతో సంబంధము ముడిపెట్టబడజాలదు (హబక్కూకు 1:13); కాబట్టి ఆయన పాపమునకు తీర్పు తీర్చవలసినదే (రోమీయులకు 6:23). పరిశుద్ధుడైన దేవుడు పాపమునకు తీర్పు తీర్చునప్పుడు, ఆయన పాపి పట్ల న్యాయమును – వానికి తగిన విషయాన్నే – ప్రవేశపెట్టుచున్నాడు. ఏది ఏమైనా, దేవుడు "కరుణా సంపన్నుడై" యున్నాడు గనుక ఆయన న్యాయసమ్మతమైన ఉగ్రతతో కూడిన తీర్పును నిలవరించాలని ఆశిస్తున్నాడు. ఏదైన ఒక న్యాయస్థానంలో, ముద్దాయి నేరము చేసిన దోషియని ధర్మకర్త కనుగొనవచ్చును కానీ ముద్దాయి యెడల కనికరము కనుపర్చబడవలెనని ఆయన సిఫారసు చేయవచ్చును. ముద్దాయి నేరము చేసిన దోషియై యున్నందునుబట్టి వానికి చట్ట ప్రకారము న్యాయసమ్మతమైన దండన సముచితమే, కానీ ఇట్టి సముచితమైన దండనను నిలవరించవలెనని ధర్మకర్త న్యాయవాదిని అడుగవచ్చును. దేవుని న్యాయస్థానంలో మనము దోషులమై యున్నాము, గనుక మనకు మరణమే సముచితమైన దండన యని న్యాయము సెలవిచ్చుచున్నది. ఏది ఏమైనా, దేవుడు మన యెడల తన కనికరము చొప్పున వ్యవహరించాలని కోరుచున్నాడు; మనకు న్యాయసమ్మతమైన దండనను నిలవరించాలని ఆయన ఆశిస్తున్నాడు. దీనిని నిశ్చయము చేసికొనుటకు, పాపియైనవాడు మొండిగా వాని పాపములోనే నిలిచియుండి చివరకు నిత్య మరణమను న్యాయమును పొందునట్లు దేవుడు

అనుమతించును; కానీ దానిని అంగీకరించవలెనని ఆశించువారి యెడల ఆయన తన గొప్ప కనికరమును విస్తరింపజేస్తాడు.

"అయినను దేవుడు" అను పదజాలము ఎఫెసీయులు ఒకప్పుడు ఏమైయుండిరో, ఇప్పుడు ఏమైయున్నారో యను విషయానికి మధ్య గల స్పష్టమైన ఒక తారతమ్యమును గుర్తిస్తుంది. దేవుడు చొరవ చేసుకొన్నాడు ఏలయనగా ఆయన న్యాయమైన ఉగ్రతగల దేవుడు మాత్రమే కాదు గాని, ఆయన కరుణగల దేవుడై కూడా ఉన్నాడు. దేవుడు కరుణా సంపన్నుడు కాబట్టి, ఆయన తన ప్రజలను నిత్య మరణము – పాపము వలన వచ్చు జీతము – నుండి కాపాడి సంరక్షించి మనకు జీవమునిచ్చాడు.

"ఆయన మనలను ప్రేమించుచున్న తన మహా ప్రేమనుబట్టి" అను మాటలు పాపముల చేత చచ్చినవారి యెడల దేవుడు తన కరుణను కనుపర్చుటకుగల హేతువును వివరిస్తున్నాయి. దేవుడు పాపుల పట్ల కరుణగల వైఖరి కలిగియున్నాడు, గనుక ఆయన పాపుల యెడల చేయుచుండు ప్రతి విషయం వెనుక గల ప్రోత్సాహం, ప్రేమయే. దేవుని కరుణ బహు గొప్పది మరియు ఆయన ప్రేమ మహా ప్రేమయై యున్నదని పౌలు చెప్పుచున్నాడు. "ఎందుకనగా" అను పదము *dia* అను మాట యొక్క అనువాదమై యుండి, "సంతృప్తిపరచునట్లు" అను అర్థమిచ్చుచున్నది;[1] ఆయన తన మహా ప్రేమను సంతృప్తిపరచునట్లు దేవుడు తన కరుణను మన యెడల విస్తరించాడు.

"ప్రేమ" అను మాటకు, ఆంగ్లములో ఉన్నట్టుగా, గ్రీకు భాషలో ఒకే పదము కాదు, కానీ నాలుగు పదాలుండినవి. ఈ నాలుగు మాటల అర్థాలను విల్యమ్ బార్క్లే చక్కగా వివరించాడు.[2] (1) *Erōs* అను పదము ప్రధానంగా స్త్రీపురుషుల మధ్య నుండు ప్రేమను లేక శారీరక ప్రేమను సూచిస్తుంది. ఈ పదము మోహపూరితమైన అనుభూతులను కలుపుకొనునంతటి అధోగతి పాలయ్యింది గనుక అది క్రొత్త నిబంధనలో మనకగుపించదు. (2) *Storgē* అను పదము కుటుంబ సభ్యుల మధ్య నెలకొని యుండు ప్రేమానురాగములకు సంబంధించినదై యుండి, తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల మరియు పిల్లలు వారి తల్లిదండ్రుల యెడల కలిగియుండు ప్రేమ సందర్భంలో ప్రయోగింపబడుచున్నది. రోమీయులకు 12:10లో ఈ పదము విశేషణ రూపంలో కనబడుచు, "మిక్కిలి భక్తిగల" ("ప్రేమానురాగముల"; KJV) అను అర్థమిచ్చుచున్నది. (3) *Philia* అను పదము భార్యాభర్తల మధ్య మరియు స్నేహితుల నడుమ నుండు ప్రేమ గూర్చి చెప్పుచున్నది. ఈ పదము యేసు లాజరు యెడల కలిగి యుండిన ప్రేమను (యోహాను 11:3, 36), యేసు యోహాను యెడల కలిగియుండిన ప్రేమను (యోహాను 20:2), మరియు తండ్రి, తల్లి, కుమారుడు, మరియు కుమార్తె ప్రేమను (మత్తయి 10:37) వర్ణించుటకు వాడబడినది. (4) "ప్రేమ" అని క్రొత్త నిబంధనలో అనువదింపబడిన అత్యంత సామాన్యమైన పదము, agape. ఈ పదము ప్రామాణికమైన గ్రీకు భాషలో సామాన్యమైనదై యుండలేదు, కానీ క్రొత్త నిబంధనలో అది "ప్రేమ"కు కీలక పదమయ్యింది.

*Agapē* అను పదము క్రొత్త నిబంధనలో నామవాచక మరియు క్రియా రూపాల్లో రెండు వందల యాభై పర్యాయముల కంటె ఎక్కువసార్లు అగుపిస్తుంది. "ప్రేమ"ను గూర్చి చెప్పుకొనునప్పుడు ఈ పదము అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొంటుంది, ఏలయనగా ప్రేమను గూర్చిన క్రొత్త నిబంధన భావములో ఉద్దేశింపబడిన సమస్తమును ఆలింగనము

చేసికొనుటకు ఈ పదము మాత్రమే చాలినంత విశాలమైనదై యున్నది. దేవుడు తానాశించిన ప్రేమను మానవాళికి అందజేయగలుగునట్లు అభివ్యక్తము చేయుటకు *agapē* మాత్రమే సమర్థవంతమైనదై యున్నది. *Agapē*, స్నేహితుని మరియు శత్రువును ఒకే రీతిలో, ఒకే భావంతో దగ్గరకు చేర్చుకొనుటకు చాలినంత విస్తృతమైనదై యున్నది. "ప్రేమ"ను తెలియజెప్పు ఇతర పదములు భ్రాంతిజనకమయిన భావోద్రేకములను – "ప్రేమ కలాపాలు" లేక ఒక తల్లి తన బిడ్డ యెడల కలిగియుండు సహజ ప్రేమ వంటివి – లేక అనుభూతులను వ్యక్తము చేయుచుండగా, *agapē*లో చిత్తము చేరియున్నది. ఈ ప్రేమ ఉద్దేశపూర్వకముగా తీసికొనిన తీర్మానము యొక్క ఫలితమై యున్నది, ఒకడు ఎట్టి పరిస్థితులలోనైనను మరొకనిని ప్రేమించుచు వాని మేలును కోరునట్లు అనుమతించు ఒక స్ఫూర్తియై యున్నది. *Agapē* "అజేయమైన పరోపకారబుద్ధి మరియు జయింపరాని సౌహార్ద ప్రీతియై" యున్నది.[3] దేవుడు మానవుని యెడల కలిగియున్న ఈ ప్రేమ సార్వత్రికమైనది మరియు అది త్యాగపూరితమైనది (యోహాను 3:16), మానవుడు అనర్హుడై యున్నది (రోమీయులకు 5:8), రక్షించునది మరియు పవిత్రీకరించునదై యున్నదని (2 థెస్సలొనీకయులకు 2:13) క్రొత్త నిబంధన ఉపదేశిస్తుంది. ఎఫెసీయులకు 2:4లో, అది కరుణాసంపన్నమైన ప్రేమయై యున్నదని మనముందుంచబడుచున్నది. *Agapē*, దేవుడు పాపుల కొరకు చేసిన సమస్తమునకు ప్రోత్సాహకమై యున్నది.

### జీవిత ఉద్దేశము (2:4–5)

**5మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను. కృప చేత మీరు రక్షింపబడియున్నారు.**

**వచనము 5.** తరువాతి వచనములో, దేవుడు మానవుల యెడల కలిగియున్న కృపాసహితము మరియు కరుణాసంపన్నమైన ప్రేమ గూర్చి పౌలు యింకా ఎక్కువగా వివరిస్తున్నాడు. మొదటి వచనములో పేర్కొనబడిన ఆధ్యాత్మిక మృతమైన స్థితిని పౌలు ఉద్ఘాటించి చెప్పుచు, పాపులు వారి **అతిక్రమములలో** చచ్చినవారై యున్నారని పేర్కొనుచున్నాడు. ఇటువంటి పాపులకు, దేవుడు తన కరుణను మరియు ప్రేమను విస్తారంగా కనుపర్చాడు. ఇచ్చట "అతిక్రమములు" అని అనువదింపబడిన అదే గ్రీకు పదము *paraptōma*, మొదటి వచనంలో "అపరాధములు" అని అనువదించబడింది. **మనము చచ్చినవారమై యుండినప్పుడు సయితము** అను పదజాలము దేవుడు సకల పాపులను ఎంత విస్తృతంగా ప్రేమిస్తున్నాడో, ఎంత విశాలంగా తన కరుణను విస్తరింపజేసాడో విశదంగా చూపిస్తుంది. యింకను పాపిష్ఠి పరిస్థితిలో నుండిన పాపులను రక్షించుటకు దేవుడు చర్యను చేపట్టి ఆయన చేయవలసినదంతా చేసాడు.

ఈ పాపుల కొరకు ఆయన ఏం చేసాడు? ఆయన **మనలను క్రీస్తుతో కూడ బ్రదికించాడు**. దేవుడు మనకు క్రీస్తులో ఆధ్యాత్మిక జీవముననుగ్రహించాడు. ఆధ్యాత్మిక మరణమనునది దేవుని నుండి ఎడబాయుటయితే (2:1 చూడుము), ఆధ్యాత్మిక జీవము దేవునితో కూడ సమాధానపడుటయై యున్నది. క్రీస్తు గొప్ప సమాధానకర్తయై యున్నాడు. "క్రీస్తు రక్తము"

(2:13), అనగా, క్రీస్తు సిలువ మరణము, మనలను దేవునితో "సమాధానపర్చబడుటను" సాధ్యం చేసిందని పౌలు చెప్పుచున్నాడు (2:16). మనము పాపము యెడల చచ్చినవారమై, క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది, నూతన జీవముగలవారమై యుండుటకు లేపబడుట ద్వారా దీనిని స్వీకరిస్తాము (రోమీయులకు 6:1-4). క్రీస్తు మరణ పునరుత్థానములలో క్రైస్తవులు ఆయనతో కూడ గుర్తింపబడుదురు. మనము నూతన జీవము పొందు విధానము ఇదే. "నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడి యున్నాను; ఇకను జీవించువాడును నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడని" పౌలు గలతీయులకు 2:20లో చెప్పినప్పుడు దానిలో ఈ ఆలోచననే బంధించాడు. క్రీస్తు మరణములో మనకు లభించు గుర్తింపు మన అంతర్యములో నివసించు పాపము యొక్క బలమును నలుగొట్టును. ఆయన పునరుత్థానములో మనకు లభించు గుర్తింపు మనకు దైవికమైన జీవితమును ఇచ్చును.[4]

మానవ జాతి యెడల దేవుడు మహా ప్రేమ కలిగియున్నందు వలన, ఆయన తనతో కూడ పాపులను సమాధానపర్చుకొనుచున్నాడు మరియు మనకు ఆధ్యాత్మిక జీవమునిచ్చుచున్నాడు. ఇదే విషయాన్ని పౌలు 2 కొరిందీయులకు 5:17, 18లో ఇలా చెప్పుచున్నాడు: "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల, వాడు నూతన సృష్టి; ... సమస్తమును దేవుని వలననైనవి, ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధానపరచుకొన్నాడు ..."

కొలొస్సయులకు 2:12, 13లో, వారి అతిక్రమములలో చచ్చినవారై యుండిన కొలొస్సయులు సజీవులు గావింపబడినవారని చెప్పుచు, ఈ అభిప్రాయమును పౌలు యింకా ఎక్కువగా వివరించాడు. వారు బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు వారి పాపములను క్షమించాడు. పాపము ఆధ్యాత్మిక మరణమును కలుగజేసింది, అయితే విధేయత క్షమాపణను, సమాధానమును, మరియు జీవమును కలుగజేసింది. దేవుని మహా ప్రేమ ఆయన కరుణకు ప్రోత్సాహకమిచ్చింది గనుక తద్వారా ఆయన దీనంతటిని సాధ్యం గావించాడు.

దేవుని కరుణ మరియు ప్రేమ ఆయన **కృపనుబట్టియే** మానవుని యెడల ప్రదర్శింపబడినవి. "కృప" అను పదము, గ్రీకు భాషలో, *charis* అను నామవాచకమై యుండి, క్షమాపణ విషయమైన ఆనందమును మరియు కృతజ్ఞతాభావమును కలుగజేయు "ఆర్జించని మరియు అర్హముకాని అనుగ్రహము" అను అర్థము నిచ్చుచున్నది.[5] "కృప" రక్షణకు సంబంధించిన దైవికమైన చొరవను గూర్చి తెలియజెప్పుచున్నది. రక్షణ, మనము మంచివారమైనందునుబట్టి లేదా మంచి పనులు చేయుచున్నందునుబట్టి మనకు అనుగ్రహింపబడలేదు, కానీ దేవుని కృపనుబట్టియే. రక్షణ సంపాదించుకొనబడగలదై, అర్హమైనదై యుండినట్లయితే, అది కృపనుబట్టి అనుగ్రహింపబడినదై యుండదు. దీని లోతుల్లోనికి వెళ్లకుండా దానిని అవగాహనకు తెచ్చుకొనుట అనేకులకు కష్టమగుచున్నది. రక్షణ కృపచేతనే అనుగ్రహింపబడునదైనట్లయితే, రక్షింపబడుటకు మనము దానిని పొందనవసరము లేదు కదా అని కొందరంటారు. ఏది ఏమైనా, పరిశుద్ధ బైబిల్ ఇలా బోధించుటలేదు. రక్షింపబడుటకు మనము మంచి కార్యములు చేయవలసినదేనని యింకొందరంటారు. మనము చేయుచుండు మంచి క్రియలు చెడు క్రియల కంటే అత్యధికంగా ఉన్నప్పుడు మాత్రమే మనము రక్షింపబడగలమని వారు అనుకొనుచున్నారని స్పష్టమగుచున్నది. ఈ దృష్టికోణము దేవుని కృపను అర్థంచేసికొనుచున్నది కాదు సరికదా, మనము చేసేది ఒక్క పాపమే అయినా, దేవునితో సరైన సంబంధమును

సంపాదించుకొనునట్లు చాలినంత చేయుటకు అది కూడ మనలను అర్హులను చేయదని అంగీకరించుచున్నది కూడా కాదు. అటుతరువాత, 8 మరియు 9 వచనములలో, మనము దేవుని కృప పట్ల ఎలా ప్రతిస్పందించాలో పౌలు వివరించాడు.

**రక్షింపబడియున్నాము** అను పదజాలము గ్రీకు భాషలో నిశ్చేష్ట కర్మార్థక క్రియాజన్య విశేషణ రూపంలో ఉన్నది; అనగా, అది వర్తమాన మరియు భవిష్యత్ పరిమాణామములతో గతంలో సంభవించిన ఒక చర్య యొక్క ఫలితాన్ని సూచిస్తుంది. రక్షణ అనునది మనకై మనమే మన కొరకు చేసికొనగల కార్యము కాదు కానీ మన కొరకు చేయబడిన ఒక కార్యమై యున్నదని ఇచ్చట ప్రయోగింపబడుచున్న కర్మార్థకము తెలియజేప్పుచున్నది. మనము దేవునిపై ఆధారపడి యున్నాము. ఈ సందర్భములో పౌలు భూతకాల, వర్తమానకాల, మరియు భవిష్యత్‌కాల రక్షణను గూర్చి మాటలాడుచున్నాడు. మనము రక్షింపబడియున్నాము (భూత కాలము), మనము ఆధ్యాత్మిక ప్రపంచంలో క్రీస్తుతో కూడ కూర్చుండియున్నాము (వర్తమానకాలము), మరియు మనము రాబోవుచున్న యుగములలో దేవుని దయ యొక్క గ్రహీతలమై యుందుము (భవిష్యత్ కాలము) అని ఆయన చెప్పుచున్నాడు. గతంలో క్రైస్తవుడు నీతిమంతుడుగా తీర్చబడి యున్నాడు, ప్రస్తుతము అతడు క్రీస్తు సారూప్యము లోనికి ఎదుగుచున్నాడు, మరియు భవిష్యత్తులో అతడు మహిమపరచబడును.

## వారసత్వ ఉద్దేశము (2:6–10)

**6 క్రీసుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము, 7 క్రీసుయేసునందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండబెట్టెను. 8 మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. 9 అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. 10 మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము.**

**వచనము 6.** మనకు రక్షణను సమకూర్చుటతో పాటు, దేవుడు సంపన్నమైనది మహిమాన్వితమైన ఒక స్వాస్థ్యాన్ని మన కొరకు సిద్ధంచేసాడు (1:18 చూడుము).

దేవుడు యేసుక్రీస్తునందు విశ్వాసముంచువారిని “క్రీస్తుతో కూడ బ్రదికించెను” (2:5) **మరియు ఆయనతో కూడ లేపాడు**. రోమీయులకు 6:1–18లో, ఇదే భావనను పౌలు యింకా కొంచెం విశదంగా నివేదించాడు. (1) అతడు బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ పాతిపెట్టబడి మరలా ఒక నూతన జీవము జీవించుటకు లేపబడినవాడును వాస్తవము సూచించుచున్నట్లు, క్రైస్తవుడు పాపమునకు చచ్చినవాడై యున్నాడని ఆయన ప్రకటించాడు. (2) క్రైస్తవుడు క్రీస్తుతో కూడ చచ్చినవాడై యున్నాడు గనుక వాడు యిక ఏమాత్రమును పాపమునకు దాసుడు కాడు. (3) క్రైస్తవుడు పాపము పట్ల చచ్చినవాడును, దేవుని యెడల సజీవుడునై యున్నాడని తనను ఎంచుకొనును. (4) క్రైస్తవుడు దేవుని యెదుట తనను తాను ఆధ్యాత్మిక మరణము నుండి లేచిన సజీవునిగా నివేదించుకొనును. (5) క్రైస్తవుడు

పాపము వలన వచ్చిన మరణము నుండి విడుదల గావింపబడి, "యే ఉపదేశక్రమమునకు అప్పగింపబడియుండెనో, దానికి హృదయపూర్వకముగా లోబడినవాడై, పాపము నుండి విమోచింపబడెను" (రోమీయులకు 6:17) గనుక నీతికి దాసుడై యుండుటకు సజీవుడై యున్నాడు.

రోమా నగరములోని క్రైస్తవుల ముందుంచబడిన సిద్ధాంతము ఆయన వెళ్లిన ప్రతి చోట పౌలు బోధించిన అదే సత్యమై యుండినది: "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీయులకు 15:3, 4). ఈ సిద్ధాంతము ఒక మాదిరి, లేక నమూనాయై యుండినది, వారు దాని లోనికి నిమగ్నముచేయబడిరి. క్రీస్తు మన పాపముల కొరకు మరణించినట్లే, రోమీయులు పాపమునకు చచ్చినవారై యుండిరి. క్రీస్తు పాతిపెట్టబడినట్లే, రోమీయులు బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ పాతిపెట్టబడిరి. క్రీస్తు లేపబడిన ప్రకారము, రోమీయులు కూడ ఒక నూతన జీవితము జీవించునట్లు లేపబడిరి (రోమీయులకు 6:1–6). ఒక విధంగా, వారు క్రీస్తుతో కూడ లేపబడినారని చెప్పుకొనవచ్చును.

కొలొస్సయులకు 2:12 మరియు 3:1లో, కొలొస్సయులు "బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై యున్నారు" గనుక "ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేపబడినవారై యున్నారని" వర్ణించినప్పుడు, పౌలు ఇదే అభిప్రాయమును బంధించి యున్నాడు. బాప్తిస్మ సమయములో, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" (మార్కు 16:16) దేవుడిచ్చిన తన వాగ్దానము చొప్పున చేయునను వారి విశ్వాసమును ప్రదర్శించారు. వారు "పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నారని" పౌలు క్రీస్తుతో కూడ లేపబడిన కొలొస్సయులను విన్నవించుకొన్నాడు (కొలొస్సయులకు 3:1).

అది ఇతర క్రైస్తవుల విషయంలో వాస్తవమైనదై యుండిన విధంగానే, బాప్తిస్మము ఎఫెసీయులను **యేసు క్రీస్తునందుంచినది**. వారు **పరలోకవిషయములలో** (1:3 చూడుము). ఆధ్యాత్మిక ప్రదేశములో **ఆయనతో కూడ కూర్చుండుటకు** లేపబడి యున్నారు. వారదివరకే వారి పాపముల నుండి రక్షింపబడి క్రీస్తునందున్నారు గనుక, చేయబడవలసిన పనులు మరియు పోరాడ వలసిన పోరాటములు యింకా మిగిలి ఉన్నాయనియు గుర్తుచేయుటకు "పరలోకవిషయములలో" గూర్చిన ప్రస్తావన ప్రయోజనపడింది. సంఘము పరలోక లేక ఆధ్యాత్మిక ప్రదేశములలో యింకను సువార్తను ప్రకటింపవలసి యున్నది (3:10) – మరియు ఆకాశమండలమందు దుష్టునికి విరోధముగా ఆధ్యాత్మిక పోరాటాలు యింకను కొనసాగుచునే యున్నది (6:10–12).

**వచనము 7.** పౌలు మాటల ప్రకారము, **క్రీస్తు యేసు నందు ఆయన మనకు చేసిన ఉపకారము ద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము** దేవుడు తన పరిశుద్ధులను రక్షించి వారిని సజీవులను గావించాడు (2:7). నిశ్చయముగా, రక్షణ మానవాళి మంచి కొరకే, అయితే అది దేవుని మహిమకు కీర్తి కలుగుట కొరకు కూడ ఉద్దేశింపబడినదై యున్నది (1:4–6, 11–12, 14). దీనికి తోడుగా, రక్షణ నొందినవారి యెడల ఆయన చూపించు తన దయయందు ఆయన కృప ఎంత సంపన్నమైనదై యున్నదో దేవుడు "చూపించుటకు" మానవుల రక్షణ దోహదపడుతుందని

పౌలు ఘోషించాడు. “రాబోవు యుగములు” అను పదజాలము క్రీస్తు యొక్క రెండవ రాకడ, మృతుల పునరుత్థానము, మరియు తీర్పు సమయమందు ప్రవేశపెట్టబడు కాలమునకు ఆవల నున్న కాలమును సూచిస్తుంది. అంత్య కాలమున దేవుడు మానవులందరిని ఆయన యెదుటకు తీసుకొని వచ్చినప్పుడు, ఆయన వారి యెదుట – మరియు దేవ దూతల పరలోక సైన్య సమూహము యెదుట – క్రీస్తు యేసు నందలి పరిశుద్ధుల యెడల గల తన కృప మరియు దయ యొక్క గొప్పతనాన్ని ప్రదర్శిస్తాడు.

పౌలు దేవుని కృపను గూర్చి మాత్రమే కాదు కానీ, దేవుని “కృపా మహదైశ్వర్యము” గూర్చి చెప్పాడు. దేవుని కృపను వర్ణించుటకు (*huperballō*, అనగా “అత్యధికమైన”) వర్తమానకాలిక విశేషణం కూడ 2 కొరింథీయులకు 9:14లో వాడబడినది. ఎఫెసీయులకు వ్రాయబడిన పత్రికలో మరొక చోట, దేవుని శక్తిని మరియు క్రీస్తు ప్రేమను వర్ణించుటకు పౌలు ఇదే పద రూపములను ప్రయోగించాడు (1:17–19; 3:19).

> ఈ చివరి రెఫరెన్సు సంబంధములోను 1:17–21 మరియు 2:4–7 మధ్య గల సమానాంతరముల దృష్ట్యా కూడ … , యేసు క్రీస్తు పరలోక ప్రదేశములో కూర్చుండునట్లు ఆయనను మృతులలో నుండి లేపుట అన్ని శక్తులను మించిన దేవుని శక్తిని గూర్చిన సర్వోచ్చమైన ప్రదర్శనయై యుండినట్లయితే, విశ్వాసులు పరలోక ప్రదేశములందు క్రీస్తుతో కూడా కూర్చుండునట్లు వారిని ఆధ్యాత్మిక మరణము నుండి లేపుట సకల కృపలను మించిన దేవుని సర్వోచ్చమైన కృప గూర్చిన ప్రదర్శనయై యున్నదని చెప్పుకొనవచ్చును.[6]

2:4–7లో నుండి కనీసము మూడు తుది అభిప్రాయములను వెలికి తీయవచ్చును. (1) క్రీస్తు మృతులలో నుండి లేపబడి దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి యున్నాడు గనుక క్రైస్తవుడు, సువార్త పట్ల ప్రదర్శించు విధేయతననుసరించి, ఆధ్యాత్మిక ప్రదేశములో క్రీస్తుతో కూడ కూర్చుండుటకు లేపబడి యున్నాడు. (2) క్రీస్తు మహిమపర్చబడి యున్నాడు మరియు క్రైస్తవునికి ఆయనతో సంబంధము కలదను వాస్తవము భవిష్యత్ అంతర్భావాలను కలిగియున్నది. (3) దేవుడు విశ్వాసి నిమిత్తము నెరవేర్చిన దాని సంపూర్ణ ప్రత్యక్షత రాబోవు యుగము సమీపించ నంతవరకు కూడ బయలుపర్చబడదు, అప్పుడు మనము ఆయనతో కూడ మహిమలో అగుపించుదుము అప్పుడు క్రీస్తు ప్రత్యక్షమగును (కొలొస్సయులకు 3:4 చూడుము).

దేవుడు పాపుల పట్ల కలిగియున్న అనుగ్రహపూరితమైన చిత్తవృత్తిని వర్ణించుటకు పౌలు “కరుణ,” “ప్రేమ,” మరియు “కృప” అను పదములను ఇదివరకే ప్రయోగించాడు (2:4–7). ఈ పదములకు తోడుగా 6వ వచనములో “ఉపకారము” (*chrēstotēs*) అను పదాన్ని కలిపాడు, మానవజాతి ఆయన యెడల కృతజ్ఞతలేనిదై యున్నప్పటికి, దేవుడు తన ప్రజల పక్షాన కలిగియున్న ఉపకారం చేయు శ్రద్ధ మరియు క్రియాశీలకమైన మంచితనాన్ని ఇది సూచిస్తుంది.[7]

**వచనము 8. ఏలయనగా** అను పదము *gar* అను గ్రీకు పదము యొక్క అర్థమై యుండి, పౌలు దీని తరువాత చెప్పిన విషయాన్ని దేవుని కృపామహదైశ్వర్యము గూర్చి ఆయన వ్రాసిన విషయములో ముడిపెట్టుచున్నది. ఎఫెసీయులు కృప చేతనే రక్షింపబడి యున్నారని పౌలు ఘోషించాడు (2:5), మరియు మానవుని విశ్వాసము విషయంలో దేవుని

కృప గూర్చిన ఆయన ఉద్ఘాటనకు పరిచయ పలుకుగా ఇది పనికివచ్చింది.

ఒకడు **కృపచేతనే రక్షింపబడునని** అపొస్తలుడు రూఢిపర్చిన విషయము వాడు ఆ కృపను పొందనవసరములేదను సలహా నిచ్చుటలేదు. రక్షణ ఆరోపింపబడిన సమస్త విషయాలు దేవుని కృపలో నుంచే ఉత్పన్నమగుచున్నవని చెప్పుకొనవచ్చును, కానీ ఒకడు కృపచేత తప్ప *మరి దేనిచేతనైనను* రక్షింపబడునని క్రొత్త నిబంధన ఎచ్చోటనైనను బోధించుటలేదు. కృప, మానవాళికి రక్షణ తెచ్చునిమిత్తము దేవుడు చేసిన సమస్తమునకు ఉపసంహారమై యున్నది. దేవుని ఈ కృప "సమస్త మునష్యులకు ప్రత్యక్షమైనది" (తీతు 2:11). అలాగైతే, అందరూ ఎందుకు రక్షింపబడలేదు? దేవుని కృపను అందరు సరైన రీతిలో, అనగా, **విశ్వాసము ద్వారా** పొందరని సామాన్యముగా సమాధానమీయవచ్చును. 2 కొరింథీయులకు 6:1లో, ఒకడు "దేవుని కృపను వ్యర్థముగా పొందవచ్చునని" పౌలు హెచ్చరిస్తున్నాడు.

"కృప," మానవుని రక్షణలో గల దేవుని పాత్రను సంగ్రహముగా చెప్పుచుండగా, దేవుని యెడల మానవుడు చూపింపవలసిన ప్రతిస్పందనను "విశ్వాసము" సంగ్రహించుచున్నది. "విశ్వాసము" కలిగియుండవలెను లేక విశ్వసించవలెనను వర్ణనను, ఒకడు దేవుని యెడల ప్రదర్శించు పూర్తి ప్రతిస్పందనను క్రొత్త నిబంధన తరుచుగా మొత్తంగాగాని లేక సమగ్రమైన విధానంలోగాని చిత్రీకరించుచున్నది (యోహాను 3:16; రోమీయులకు 1:16; 5:1 చూడుము). దీనికి తోడుగా, "విశ్వాసము" మరియు "నమ్మకము" అను మాటలు క్రొత్త నిబంధనలో ఒకడు దేవుని యెడల ప్రదర్శించు అనేక ప్రతిస్పందనలలో ఒకటిగా, ఒక నిర్దిష్టమైన రీతిలో వాడబడినవి (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 18:8 చూడుము). అపొస్తలుల కార్యములు 16:25-34లో, ఫిలిప్పీ పట్టణములోని చెరసాల నాయకునిలో కలిగిన మార్పును వైద్యుడైన లూకా గ్రంథస్థం చేసాడు. "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమిచేయవలెను?" అని చెరసాల నాయకుడు పౌలును ప్రశ్నించినప్పుడు, "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము" అని సమాధానమీయబడింది (వచనమలు 30, 31). ఆ తరువాత పౌలు అతనికి "దేవుని వాక్యము" బోధించాడు, అప్పుడు అతడును అతని ఇంటివారందరును బాప్తిస్మము పొందారు (వచనములు 32, 33). చెరసాల నాయకుడు బాప్తిస్మము పొందిన మీదట, "దేవుని యందు విశ్వాసిముంచినవాడై" ఆనందించాడు (వచనము 34). విశ్వాసము, విధేయతతో కూడినదై యుండినదని ఈ సంఘటన మనకు ఉదాహరణంగా చిత్రీకరించుచున్నది.

క్రీస్తు యెడల విశ్వాసముతో ప్రదర్శింపబడు ప్రతిస్పందన "విశ్వాసము చేతనే" అను ప్రతిస్పందనయై యున్నదని ప్రజాదరణ పొందిన అభిప్రాయమును వెల్లడిస్తుంది, కానీ క్రొత్త నిబంధన అలా బోధించుటలేదు. నిజానికి, క్రొత్త నిబంధనలో "విశ్వాస మూలమున మాత్రమే" అను మాటలు ఒకే ఒక్క సారి అగుపించు సందర్భము, "... గాక" పదముతో కూడినదై యున్నదని (యాకోబు 2:24).

"విశ్వాసము," "నమ్మకము," మరియు "నమ్మకముంచు" అను పదాలన్నిటికి మూలము ఒక్కటే. దీని క్రియా రూపమై యున్న *pisteuō "సంపూర్ణముగా ఒప్పింపబడిన ఒక స్వీకారము"* లేక *"సంపూర్ణ హామీ ఇవ్వబడి అచంచలమైనదై యున్న ఆత్మధైర్యము"* అని నిర్వచింపబడుచున్నది.[8] విశ్వాసము అను భావనలో "... ఒప్పింపు ... నమ్మకము ... విధేయత" కలిసియున్నవి.[9] బైబిలు సంబంధమైన విశ్వాసము సమగ్రమైన స్వభావము

కలిగినదై యున్నది. పాత మరియు క్రొత్త నిబంధనలలో, దేవుని చేత ఆమోదింపబడిన విశ్వాసము ఒప్పింపు, నమ్మకము, మరియు విధేయత అను మూడు లక్షణముల చేత గుర్తింపబడింది.

మనము విధేయతా పూర్వకమైన విశ్వాసము కలిగియున్నప్పటికిని, మనలను మనము రక్షించుకొనజాలము. **ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే** అని పౌలు అటుతరువాత చెప్పుచున్నాడు. "ఇది," *touto* యొక్క అనువాదమైయుండి, రక్షణ ప్రక్రియనంతటిని సమర్థిస్తుంది. దేవుని కృప రక్షణను సాధ్యంచేసింది, గనుక మానవుని విశ్వాసము రక్షణను స్వీకరించుటకు ప్రయోజనపడు సాధనమై యున్నది. అలాగైతే, రక్షణ, మానవుడు సాధించిన సంగతి కాదు, కానీ అది మానవునికి ఒక "వరముగా" అనుగ్రహింపబడుచున్న అంశమై యున్నది. రక్షణ "దేవుని వరమై యున్నది" కాబట్టి, ఇట్టి వరము అంగీకరించబడనంత వరకు ఏ ఒక్కడైనను ప్రయోజనము పొందడని రక్షణ నొందు ప్రక్రియ నిమిత్తము మానవుడు *ఏమియు చేయలేదని* సాధికారంతో చెప్పువారు గమనించవలెను. రక్షణ యను దేవుని వరము కృపచేతనే అనుగ్రహింపబడుతుంది కానీ అది విశ్వాసము చేత అంగీకరింపబడుతుంది. మానవుడైయున్న ఒక తండ్రి తన కుమారునికి స్వాస్థ్య రూపంలో ఒక బహుమానము నిచ్చినట్లయితే, పిల్లవాడు అట్టి వరము ద్వారా ప్రయోజనము పొందగోరినట్లయితే వాడు దానిని అంగీకరించవలెను.

**వచనము 9.** ఇంతేగాక రక్షణ మానవ ప్రయాసము యొక్క **ఫలితార్థము కాదు** కానీ, అది కృపా వరమే యను విషయాన్ని కూడ ఈ వాంగ్మూలము నొక్కివాక్కాణించుచున్నది. విశ్వసించు, నమ్మకముంచు, విధేయత చూపించు విశ్వాసము మానవ ప్రయాసమే కదా, గనుక రక్షణకు అదంతా అవసరంలేదని కొందరు ధృవీకరిస్తున్నారు. ఇందుకు పరస్పరం విరుద్ధంగా, విశ్వాసములో దాని **క్రియలు** కలవు. "క్రియల వలన కలిగినది కాదని" పౌలు చెప్పినప్పుడు, ఆయన అర్హమైన క్రియల గూర్చి చెప్పుచుండెను, గనుక ఏ ఒక్కరును రక్షణకు అర్హులై యుండలేరు. ఎవరైనా గాని రక్షణను సంపాదించుకొనగలిగి యుండినట్లయితే, అతడు తాను సాధించిన విషయాల గూర్చి దేవుని యెదుట **అతిశయించుచు** రక్షణ అతనికి అచ్చియున్నదైన ఒక ఋణమై యున్నదని ఖచ్చితముగా చెప్పవచ్చును. ఏది ఏమైనా, ఎవడును అతిశయించుటకు ఆస్కారమే లేదని పౌలు చెప్పుచున్నాడు. యోగ్యమైనవని అనుకొనబడు క్రియలు ఒకనికి రక్షణను తెచ్చిపెట్టజాలవు, కానీ విశ్వాసమునకు వక్తీకరణములై యుండు క్రియలు ఎల్లప్పుడు ఆవశ్యకమైనవై యున్నవి. "విశ్వాసము క్రియలులేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగునని" యాకోబు చెప్పినప్పుడు, ఆయన మనస్సులో ఉండినది ఇదే (యాకోబు 2:17). "... క్రియలు లేకుండా నీ విశ్వాసము నాకు కనుపరచుమని" చెప్పుచు యాకోబు ఎవరునూ ఎదురు సవాలుచేయలేని సవాలును మనముందుంచుచున్నాడు (యాకోబు 2:18). ఒకడు విశ్వాసము గూర్చి మాటలాడవచ్చును, కానీ అతడు విశ్వాసమును *ప్రదర్శించినట్లయితే,* అది గమనించదగు చర్యల ద్వారా – క్రియల ద్వారా ప్రదర్శింపబడుతుంది. ఒకడు సువార్తకు విధేయుడగుట ద్వారా, వానికి దేవుని కృప చేత అనుగ్రహింపబడు రక్షణను వాడు అంగీకరించినప్పుడు, వాడు ఏమియు సంపాదించలేదు గనుక వాడు అతిశయించుటకు ఏ హేతువైనను లేదు. వానికున్న కారణమెల్లా క్రీస్తు సిలువలో ప్రదర్శింపబడిన దేవుని కృపలో ఆనందించడమే.

హెబ్రీ పత్రిక 11వ అధ్యాయంలో గల దేవుని "విశ్వాస వీరుల గౌరవ జాబితా"లో, ఈ విషయము విధితంగా వివరింపబడి యున్నది. పాత నిబంధనలోని మన పితరులు వారి విశ్వాసాన్ని విధేయతతో ప్రదర్శించారు. హేబెలు బల్యర్పణ చేసాడు, హనోకు సంతోషపర్చాడు, నోవాహు నిర్మించాడు, అబ్రాహాము లోబడి అర్పించాడు, మరియు మోషే ఒక ఎంపిక చేసుకొన్నాడు. దేవుడు కృపాసహితంగా అనుగ్రహించు దానిని అంగీకరించు విశ్వాసము ఇదే - ఒప్పింపు, నమ్మకము, మరియు విధేయత కలిసియున్న విశ్వాసము ఇదే.

**వచనము 10.** 8వ వచనములో వలెనే, తన తలంపును అంతకు మునుపు చెప్పిన దానితో జోడించుటకు పౌలు **మరియు** అను మాటను ప్రయోగించాడు. మెచ్చుకోదగిన తన క్రియల ద్వారా మానవుడు ఎన్నటికిని రక్షణను సంపాదించుకొనజాలడు, గనుక **వారు సత్ క్రియలు చేయుటకై క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారై, దేవుడు చేసిన పనియైయున్నారని** పౌలు క్రైస్తవులకు గుర్తుచేయుచున్నాడు. రక్షణ దేవుడనుగ్రహించు ఒక వరమై యున్నదే కానీ మానవుడు అతిశయించుటకు హేతువగునట్లు అది మానవుని క్రియల ద్వారా సంపాదించుకొనబడినది కాదని చెప్పుటకు ఈ వాంగ్మూలము ఒక అదనపు సూచనయై యున్నది. రక్షింపబడినవారు "సత్ క్రియలు చేయుటకై క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారై" యున్నారు గనుక, ఇటువంటి క్రియలు ఒకని రక్షణకు హేతువై యుండజాలవు. కానీ విశేషంగా, బాప్తిస్మము సమయములో వారు క్రీస్తు లోనికి ప్రవేశించినప్పుడు వారికి రక్షణ నొసగబడినది.

ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించాడు, గనుక ఈ విశాల విశ్వమంతయు ఆయన చేతిపనియై యున్నది. ఇప్పుడు దేవుడు మనలను "క్రీస్తునందు" సృజించాడు, గనుక మనము ఆయన చేసిన పనియై యున్నాము. క్రీస్తు యేసునందలి ఈ సృష్టి వర్ణనాత్మకమైనదై యున్నది: వారి పాపముల నుండి రక్షించుట ద్వారా దేవుడు పాపులను నూతన సృష్టి గావించాడు. 2 కొరింథీయులకు 5:17లో, "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల, వాడు నూతన సృష్టి" అని పౌలు చెప్పుచున్నాడు. అటుతరువాత 2వ అధ్యాయంలో, క్రీస్తునందలి యూదులు మరియు అన్యజనుల గూర్చి మాటలాడుచుండిన సందర్భములో, "ఈ ఇద్దరిని తన యందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి" అని చెప్పుచు, వారి యెడల దేవుడు చేపట్టిన అదే చర్య గూర్చి పౌలు మాటలాడుచున్నాడు (2:15). 4:24లో పాపుల రక్షణను చిత్రీకరించుటకు అదే గ్రీకు పదము *ktizō* ప్రయోగింపబడింది. మానవునికి విస్తరింపబడిన దేవుని వరము రక్షణయై యున్నది. క్రీస్తు యేసునందలి దేవుని సృజనాత్మకమైన చర్య ఈ గ్రంథ పాఠములోని రక్షణ సాధనోపాయమై యున్నది, మరియు మనము సత్ క్రియలు చేయుట మన రక్షణ సంకల్పమై యున్నది.

దేవుడు సృజించిన ఈ విశాల విశ్వమునకు క్రీస్తు ప్రతినిధియై యుండెను (యోహాను 1:1-3; హెబ్రీయులకు 1:2; కొలొస్సయులకు 1:16), గనుక క్రీస్తు యేసునందు దేవుడు సృజించిన నూతన మానవునికి కూడ ప్రతినిధియై యున్నవాడు క్రీస్తే. ఈ నూతన పురుషుడు "సత్ క్రియలు చేయుటకై" సృజింపబడెను. క్రీస్తు యేసునందున్నవారి జీవితములు సత్ క్రియల చేత గుర్తింపబడవలెను. వాస్తవానికి, సత్ క్రియలు, నూతన సృష్టి గావింపబడిన వాని యెడల సదుద్దేశమును, సత్ఫలితమును, లేక లక్ష్యమునై యున్నవి. కాబట్టి,

మెచ్చుకోదగిన సత్ క్రియలు పాపులను రక్షించజాలనివై యుండగా, విశ్వాసము ద్వారా కృప చేత రక్షింపబడినవారి ప్రవర్తన ప్రేమ పూర్వకముగా చేయబడు సత్ క్రియల ద్వారా వారి విశ్వాసము యొక్క ప్రామాణికమును ప్రదర్శించవలసినదై యున్నది (గలతీయులకు 5:6). దేవుని యెడల తొల్దొలుత ప్రతిస్పందించు విశ్వాసము విధేయతతో కూడిన క్రియల ద్వారా ప్రదర్శింపబడిన విధంగానే (యాకోబు 2:17 చూడుము), క్రీస్తునందున్న వారి చేత వినియోగింపబడు విశ్వాసము అది ప్రామాణికమైనదై యున్నదని వారి సత్ క్రియల ద్వారా ప్రదర్శింపబడుతుంది. ఇదే అభిప్రాయము తీతు 3:5, 8లో కలదు. అచ్చట, దేవుడు విశ్వాసులను వారి మానవ క్రియలనుబట్టి గాక, తన కృపనుబట్టియే రక్షించాడనియు, కాని రక్షింపబడినవారు వారి సత్ క్రియలలో కొనసాగుచుండునట్లు తగు మాత్రపు జాగ్రత్త వహించవలెననియు పౌలు ఘోషించాడు.

**వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన** "సత్ క్రియలు" గూర్చి పౌలు మాటలాడుచుండెను. క్రీస్తు యేసునందుండిన విశ్వాసులను దేవుడు జగదుత్పత్తికి మునుపే చూడగలిగాడు (1:4-6). ఇదే రీతిలో, వారు క్రీస్తు నందు జీవించుచుండిన నూతన జీవితము ప్రకారము ఆయన తన ప్రజల నైతిక మరియు సదాచార సంబంధమైన ప్రవర్తనను ముందుగానే గమనించాడు.

"సత్ క్రియలు" మానవులను రక్షించుటలో గల ఆయన సంకల్పములోని ఒక భాగముగా ఆయన చూసాడు; గనుక రక్షింపబడినవారముగా "వాటి యందునడుచుకొనుట" మన ఉద్దేశములోని ఒక భాగమై యుండవలెను. సత్ క్రియలు చేయుటకు శక్యమగు అంతర్గత సామర్థ్యము దేవుని చేత నిత్య ప్రణాళికలో ఏర్పాటుచేయబడింది, గనుక ఆయన ప్రణాళిక నెరవేరుట రక్షింపబడినవారిలోని మార్పునొందిన జీవన శైలిలో కనబడవలసినదై యుండినది. సత్ క్రియలు చేయవలెనని దృఢనిశ్చయము చేసికొనుట మన జీవితముల విషయంలో గల దేవుని సంకల్పము నెరవేర్చబడు నిమిత్తము మనము చేసికొనవలసియున్న తీర్మానములో భాగమై యున్నది.

## అన్వయము

### సిలువను మించి – జాలిగల దేవుడు (2:4-12)

"అయినను దేవుడు" అను మాటలు వాస్తవంగానే ఎంతో గొప్ప తేడాను కలుగజేయుచున్నవి. 4వ వచనం "మరియు దేవుడు వారినందరిని ఖండిచెను" లేదా "మరియు దేవుడు వారిలోని ప్రతి చివరి వ్యక్తిని సహితము నాశనము చేసెను" అను మాటలతో మొదలౌతుందని మనము అనుకొని యుండవచ్చును. అలా కాకుండా, దేవుని జాలి గుండె స్వభావము గూర్చి పౌలు మాటలాడుచున్నాడు.

*"కరుణాసంపన్నుడు."* దేవుడు ఏదో మాములు కరుణగలవాడు కాడు; ఆయన కరుణాసంపన్నుడై యున్నాడు. కరుణను కలిగియుండు విషయంలో ఆయన సుసంపన్నుడు. అర్హమైన దానిని ఆపుజేయుటయే కరుణ కోరుచున్న విషయమై యున్నది. పాపులు నశింపజేయబడవలసినవారై యున్నారు, కానీ దేవుని కరుణ అట్టి నాశనమును నిలుపుచేయుచున్నది.

*"తన మహా ప్రేమ."* పాపుల పట్ల తన కరుణను విస్తరింపజేయవలెనని దేవుడు ఇందు మూలముననే ఆశిస్తున్నాడు. ఆయన సమస్త పాపులను తన మహా ప్రేమ చేత ప్రేమించుచున్నాడు.

*"కృప చేత రక్షింపబడియున్నారు."* దేవుని కృప ఆయన యొక్క "అనర్హమును, అయోగ్యమును, అనార్జితమునైన అనుగ్రహమై" యున్నది. పాపులు ఎన్నటికిని అర్హులు కాని దానిని వారికి అనుగ్రహింపవలెననియే కృప ఆశిస్తుంది. ఈ సత్యములను గమనించండి: న్యాయము ఒకడు అర్హమైనదానిని వానికి చేకూర్చుతుంది, మరియు దేవుడు, న్యాయవంతుడైనవాడు, పాపులు నశించునట్లు అనుమతించును; కానీ కరుణ అనేది అర్హమైనదానిని ఆపుజేయాలని ఆశిస్తుంది, గనుక దేవుడు కరుణగలవాడై యున్నాడు; మరియు కృప ఒకడు ఎన్నటికిని అర్హుడు కాని దానిని వానికి అనుగ్రహించుచున్నది. ప్రతి ఒక్కడు పాపములోనే నిలిచియుండి దేవుని న్యాయసమ్మతమైన న్యాయమునే కోరుకొంటాడో – మరణమును – లేదా క్రీస్తు యేసునందు అనుగ్రహింపబడు దేవుని ప్రేమ, కరుణ, మరియు కృపను అంగీకరించి తద్వారా రక్షింపబడుటకే కోరుకొంటాడో, ఎంపిక చేసుకొనవలెను. పాపి విశ్వాసము ద్వారా కృప చేత రక్షింపబడనంత వరకు, వాడు క్రీస్తు నుండి వేరైనవాడుగాను దేవుడు లేనివాడుగాను నిలిచియుండును (2:12).

జేయ్ లాక్‌హార్ట్

**ఆయన కృపా విజయ చిహ్నాలు (2:1–10)**

క్రీడాకారుల్లోని విజేతలు తరుచుగా జయప్రద చిహ్నాలు, రిబ్బనులు, లేదా పతకములు బహూకరింపబడుచుందురు. ఈ పారిపోషికములు అట్టి విజేతల సాధింపులను గుర్తిస్తూ వారికి ఘనత తెచ్చును. సుదీర్ఘమైన ఈ సంప్రదాయము, పౌలు పత్రికల పాఠకులు సుపరిచితులై యుండిన, కనీసము ఒలింపిక్ క్రీడల కాలానికి సంబంధించినదై యున్నది (1 కొరింథీయులకు 9:24; 2 తిమోతి 2:5 చూడుము). అది ఎంతో ఆశ్చర్యకరముగా అగుపించుచున్న విధంగానే, దేవుని యొద్ద కూడ జయప్రద చిహ్నాలున్నాయి. వాటిని గూర్చి మనము ఎఫెసీయులకు 2:1–10లో నేర్చుకొనగలము.

*మన గతము.* ఎంపిక, విమోచనము, మరియు స్వాస్థ్యము విషయంలో దేవుడు మన కొరకు చేసిన కార్యముల గూర్చి పౌలు చెప్పుచుండెను. ఏది ఏమైనా, ఇశ్రాయేలు దేవుని యెదుట నుండు మన పరిస్థితిని మనము అర్థంచేసికొంటే తప్ప, దేవుడు మన కొరకు చేసిన కార్యముల గూర్చి మనమెన్నడును హర్షించము. ఇది మనలను క్రీస్తు నందలి "సువార్తమానమునకు" సిద్ధపరచు "దుర్వార్త"యై యున్నది. పౌలు మన గతాన్ని గూర్చి చర్చిస్తూ, మనలో ప్రతి ఒక్కరి గూర్చి వాస్తవమై యుండిన నాలుగు గుణలక్షణములను గుర్తించాడు.

1. మనము చచ్చినవారమై యుంటిమి (2:1). స్పష్టంగా, ఆయన మన భౌతిక దేహముల గూర్చి మాటలాడుచుండలేదు, కానీ ఆయన మన ఆత్మల గూర్చి ప్రస్తావించుచుండెను. మన ఆంతర్య పురుషుడు మృతిచెందాడు. ఏదెను తోటలో నిషేధింపబడిన పండును ఆదాము ఆరగించినప్పుడు, ఆయన ఆత్మ దేవుని ఆత్మతో కలిగియుండిన సన్నిహితమైన సంబంధమును కోల్పోయింది. అతని వలెనే, పాపము వలన,

మనమందరమును ఆధ్యాత్మికముగా చచ్చినవారమై యున్నాము.

చచ్చిపోయిన ఒకనికి అవసరమయ్యింది ప్రాణము కంటె ఎక్కువైనదేముంటుంది? వానికి జీవము అవసరమై యున్నది! "బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడని" యేసు సెలవిచ్చాడు (యోహాను 11:26). మరణమనునది వాస్తవముగా ఒకని ఆత్మ వాని దేహములో నుండి వేరైపోవుట కాదు, కానీ వాని ఆత్మ దేవుని నుండే వేరైపోవుటయై యున్నది. నిత్య జీవము కేవలము నిరంతరము జీవించుట కాదు. నరకములోని ఆత్మలు నిరంతరము జీవించును. "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే, నిత్యజీవమని" యోహాను 17:3 సెలవిచ్చుచున్నది.

క్రీస్తును ఎరిగి ఆయనతో కూడ ప్రాణధారమైనంతటి సంబంధములో నిలిచియుండుట ద్వారా నిజమైన జీవము కలుగుతుంది. మన నగరమంతా చచ్చినవారితో నిండియున్నది; వారు చచ్చినవారై యున్నారు ఏలయనగా క్రీస్తుతో, జీవమునకు ఒకే ఒక్క మూలాధారమై యున్నవానితో, వారికి సంబంధము లేదు.

2. మనపై పెత్తనం చెలాయించబడింది (2:2). వాయుమండల రాజ్యమును ఏలుచున్నవాడెవడు? సహజంగానే, సాతానే. ఇహలోకమందు ఆధ్యాత్మిక మరణములో నడుచుకొనుచున్న స్త్రీపురుషుల ప్రస్తుత పరిపాలకుడు వాడే.

"నా మీద ఎవరూ పెత్తనం చెలాయించడంలేదు. నా కిష్టమయ్యింది చేయడానికి నేనొక స్వేచ్ఛాజీవిని" అంటూ వీధిలోని సగటు మనిషి వాదిస్తాడు. అతడు తనకిష్టమయ్యింది చేయడానికి అతనికి స్వేచ్ఛ ఉన్నది; సమస్య ఏమంటే సరైన క్రియలు చేయడానికి అతడు ఇష్టపడుట లేదు.

ప్రజల హృదయాలను సాతాను తన అదుపులో ఉంచుకొనుచు, వారు స్వేచ్ఛపరులని వారనుకొనునట్లు వారి తలంపులను మార్చివేస్తున్నాడు, కానీ వాస్తవానికి వారు పాపమునకు దాసులైపోయారు.

3. మనము అవిధేయులమై యుంటిమి (2:2). ఏదెను వనములో ప్రదర్శింపబడిన అవిధేయతా స్ఫూర్తియే మానవజాతి యొక్క అసలైన సమస్యయై యుండింది. దేవుడు ఆదాము హవ్వలకు ఒక ఎంపికనిచ్చాడు, అయితే వారు దేవునికి విరోధముగా ఎంపికచేసుకొన్నారు. ఆనాటి నుంచి ప్రజలు తిరుగుబాటుతనముతో కూడిన అవిధేయతతో జీవిస్తున్నారు.

"నీ పొరుగువాని ప్రేమించుమని" దేవుడు సెలవిచ్చుచున్నాడు, కానీ ప్రజలు ఒకరి నొకరు ద్వేషించుకొనుచున్నారు. "నీ సొంత భార్య యెడల విశ్వసనీయమైనవాడవుగా ఉండుమని" దేవుడు సెలవిచ్చుచున్నాడు, కానీ పురుషులు తమ సొంత భార్యల యెడల విశ్వాసఘాతుకము తలపెట్టుచున్నారు. "ప్రథమ స్థానం నాకివ్వండని" దేవుడు సెలవిచ్చుచున్నాడు, కానీ ప్రజలు వారు వాడుకొనగా మిగిలిపోయినవాటిని దేవునికిచ్చుచున్నారు. మానవ చరిత్ర అంతా అవిధేయతతో కూడినదై యున్నది.

4. మనము శాపగ్రస్తులమైయుంటిమి (2:3). మన దుర్మార్గములనుబట్టి, సరైనదేదో తెలిసియుండియు దాని యెడల మనము విపరీత బుద్ధితో అవిధేయులమగుటనుబట్టియు, మనము దేవుని ఉగ్రతపాలయ్యాము. పవిత్రుడును పరిశుద్ధుడునై ఈ విశాల విశ్వమంతటికి సృష్టికర్తయైయున్న దేవుని యెదుట నిస్సందేహంగా మనము దోషులమయ్యాము. ఆయన న్యాయసమ్మతమైన న్యాయమును తృప్తిపరుచునట్లు మనము దేవునికి దూరమైన

నిత్యత్వమునకు ఖండింపబడినవారమైతిమి. మన సొంత క్రియలు మరియు తీర్మానముల చేత, మనము నిరీక్షణలేనివారమయ్యాము గనుక భయంకరమైన మన సొంత నిత్యనాశనమును తప్పించుకొనుటకు ఎవ్విధమైన మార్గమైనను లేకుండాపోయింది!

*మన ప్రస్తుతము.* ఇదే ఒక చెడు వార్తయై యున్నది – మన సొంత చర్యల మూలమున మనకై మనము కలుగజేసుకొన్న విషయము. ఆ తరువాత పౌలు, ఇట్టి సందిగ్ధావస్థలోంచి మనలను బయటికి తెచ్చుటకుగాను దేవుడు మన కొరకు చేసిన శుభవర్తమానమును తెలియజెప్పుచున్నాడు. మనకై మనము చేసుకొన్నది ఇచ్చట నొక్కివక్కాణింపబడుట లేదు; ఏలయనగా అదంతా దేవుడు చేసిన కార్యమై యున్నది.

1. మనము పునరుత్థానము గావింపబడితిమి (2:4, 5). చచ్చిపోయినవానిని మరలా బ్రతికించుట, అది కృప ద్వారానే సంభవమౌతుంది. వాడు తనకు తాను ఏమిచేసుకొనగలడు? ఏమీచేసుకొనజాలడు! ఆ పనిని వాని కొరకు ఎవరో మరొకరు చేయాల్సిందే. అందువలన రక్షణ కృపచేతనే కలుగుతుంది. దేవుడు మానవ జాతికి రక్షణ భాగ్యమును సమకూర్చకుండినట్లయితే, అట్టి కార్యము అంత సులభంగా జరిగేది కాదు.

చచ్చిపోయినవాడు జీవమును ఎలా పొందగలడు? అదొక *ఉదాహరణము* ద్వారా లభిస్తుందా? "సజీవులమైయున్న మేము చేసే విధానము ఇదే" అని పలుకుచు, మనము ఒక శవము చుట్టూర పరుగెత్తుదుమా లేక గంతులువేయుదుమా? లేదు, చచ్చిపోయినవాని సమస్యను పరిష్కరించుటకు ఏదైన ఒక మంచి ఉదాహరణము సరిపోదు! అలాగే ఆధ్యాత్మికముగా చచ్చిపోయినవారిని మార్చుట సహితము సరిపోదు.

*పరిసరాల* సంగతేమిటి? చచ్చిపోయినవాడు సౌభాగ్య సమృద్ధితో ఎలా బ్రతకాలో తెలిసిన ప్రజలకు దగ్గరలో ఉండగలుగునట్లు మనము వానిని పట్టణములోని ఒక మంచి చోటుకు తీసుకొనివెళ్లవచ్చును. ఏది ఏమైనా, ఇది కూడ వానికి ప్రాణం పోయదు.

*ప్రోత్సాహించుట*, మనము ప్రయత్నించుటకు మరొక ఎంపికయై యున్నది. మనము వానితో ముచ్చటించవచ్చును. పేరు ప్రఖ్యాతులు గాంచిన ప్రసంగీకుడొకరు వాని యొద్దకు వచ్చి, "లే! నీవు లేవగలవు! నిర్మాణాత్మకంగా ఆలోచించు!" అంటూ వానిని సవాలు చేయవచ్చును.

మనము పైన చెప్పుకొన్న పద్ధతులలో ఏ ఒక్కటైనను ప్రయోజనకరమై యుండుటకు పనికి రాదు. చచ్చిపోయినవానికి అవసరమై యున్నది, జీవము! దైవికమైన పునరుత్థానము కంటె తక్కువైనదేదియు మన అసలు సమస్యను పరిష్కరించజాలదు. దేవుడు దిగి వచ్చి మన ఆత్మలలో నివసింపవలసినదే. అంచేతనే క్రీస్తు, "నేనే ... జీవమునై యున్నానని" ప్రకటించాడు (యోహాను 11:25). చచ్చిపోయిన వారికి యేసు క్రీస్తు అత్యంత ఆవశ్యకమై యున్నాడు.

క్రైస్తవ్యము, రోగియైన వాడొకడు స్వస్థత నొందుటను గూర్చినది కాదు. అది, చచ్చిపోయినవాడు ప్రాణం పోసుకొని సజీవుడగుటను గూర్చినదై యున్నది. దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి, మనము నూతన జీవము పొందినవారమై యున్నాము. మనము మృతులలో నుండి క్రీస్తుతో కూడ లేపబడి యున్నాము.

2. మనకు విశ్రాంతి నొసగబడినది (2:6). కూర్చుండుటకు సంబంధించిన ఆలోచన సంపూర్తి చేయబడిన కార్యమును బైబిల్ సూచిస్తుంది. ఉదాహరణ, యేసు క్రీస్తు పరిచర్య

లేవీయ వంశస్థులైన యాజకుల పరిచర్యకు ఎంత శ్రేష్ఠమైనదై యున్నదో హెబ్రీ పత్రిక రచయిత సూచించాడు: "ప్రతి యాజకుడు సేవచేయుచు, పాపములను ఎన్నటికిని తీసివేయలేని ఆ బలులనే మాటిమాటికి అర్పించుచు ఉండును; ఈయనయైతే (క్రీస్తైతే), పాపముల నిమిత్తము సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి, అప్పటి నుండి తన శత్రువులు తన పాదములకు పాదపీఠముగా చేయబడు వరకు కనిపెట్టుచు దేవుని కుడిపార్శ్వమును *ఆసీనుడాయెను*" (హెబ్రీయులకు 10:11, 12).

రక్షణను సమకూర్చు విషయమై యేసు చేపట్టి చేసిన కార్యము సిలువ మీద పూర్తి గావింపబడింది, గనుక ఆయన దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యాడు. మన విమోచన కార్యమును సాధించి మన కొరకైన స్వాస్థ్యమును సంపాదించి వాటిని పదిలపర్చునట్లు ఆయన చేయుటకు ఏ కార్యమైనను మిగలలేదు. ఆయన విమోచనా కార్యము చేయబడింది; గనుక ఇప్పుడు ఆయన మన కొరకైన నిత్య జీవమును కొని తెచ్చు పనుల నుండి విశ్రాంతి తీసుకొనవచ్చును.

ఇప్పుడు మనము యేసు క్రీస్తుతో కూడ పరలోక ప్రదేశములలో కూర్చుండియున్నామని పౌలు ఘోషిస్తున్నాడు. పరలోకంలో మన స్థలాన్ని పదిలపర్చుకోడానికి మనము వెర్రెక్కినవారివలె ప్రయత్నించవలసిన పనిలేదు. నిత్య జీవం యేసు క్రీస్తునందు అదివరకే మనదయ్యింది. "సమాప్తమైనది" అని ఎంతో కాలం క్రితమే కేకవేసిన వానిలో మనము యిక విశ్రాంతి తీసుకొనవలసినవారమై యున్నాము. దేవుని కృపనుబట్టి, మన రక్షణ సిలువ మీద పదిలపర్చబడింది.

*మన ఉత్తరాపేక్ష.* మన రక్షణ పూర్తిగావింపబడినది, గనుక మనము దేవుని జయప్రద చిహ్నాములమయ్యాము: "క్రీస్తు యేసునందు ఆయన మనకు చేసిన ఉపకారము ద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగమలలో కనుపరుచునిమిత్తము ..." (2:7). భవిష్యత్ నిత్యత్వము యొక్క రాబోవు యుగములలో, దేవుని ఆశ్చర్యకరమైన కృపకు చిహ్నాములుగా విమోచింపబడినవారు పరలోక సైన్యసమూహము యెదుట ప్రదర్శింపబడుదురు. దేవదూతలు దేవుని కృపా మహదైశ్వర్యమును చూచి అచ్చెరువొందెదరు. ఎంతో అపరిశుద్ధులమై యుండిన మనలను సహితము రక్షించుటకు పరిశుద్ధుడైన మన దేవుడు ఒక మార్గమును కనుగొనిన విషయమును గ్రహించి వారు భయభీతితో నిలువబడి యుందురు (ప్రకటన 7:9–12).

1. దేవుని ప్రణాళిక (2:8, 9). దేవునికి మహిమ తెచ్చుటకు మనము నిత్యమైన ప్రదర్శనయై యుండవలసి యున్నట్లయితే, ఎవడును అతిశయించకుండునట్లు చేయుటకు మన రక్షణ కార్యమును నేరవేర్చుటకుగాను ఆయనకు ఒక ప్రణాళిక ఉండవలెను. అలాగైతే ఆయన ప్రణాళిక ఏమైయున్నది? "ఏలయనగా *మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు;* ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే; అది క్రియల వలన కలిగినది కాదు, గనుక ఎవడును అతిశయపడ వీలులేదని" పౌలు చెప్పుచున్నాడు (2:8, 9; నొక్కి చెప్పడం చేర్చబడింది).

కృప చేతనే రక్షింపబడుట అనగా అర్థమేమి? అనగా దేవుడు ఎవరినైనాగాని రక్షింపవలసిన అవసరం ఆయనకు లేదని అర్థం. మనము మన పాపములలోనే చచ్చిపోయి మనము నిత్యత్వమునకై నరకమునకు పోవుటను ఆయన అనుమతించి,

ఆయన పరిశుద్ధుడుగా నిలిచియుండవచ్చును. ఆయన మనలను ప్రేమిస్తున్నాడు గనుక, ఆయన చేయుటకు బాధ్యుడు కాని కార్యమును మన కోసం చేయుటకు తనంతట తాను స్వచ్ఛందంగా ఎన్నుకొన్నాడు. మానవుడు తన కోసం తనకైతానే చేయజాలని కార్యమును మానవుని కోసం చేయాలని దేవుడు స్వచ్ఛందంగా తీర్మానించుకొనుట కృపా ఫలితార్థమై యున్నది.

చేయబడవలసిందెల్లా, విధేయతాపూర్వక విశ్వాసముతో కూడిన ప్రతిస్పందనయై యున్నది. ఆ ప్రణాళికకు మనము విధేయతతో ప్రతిస్పందించినప్పుడు, దేవుడు మనలను క్షమించి మనకు నూతన జీవము ననుగ్రహించునని నమ్ముచు, దేవుని రక్షణ ప్రణాళికను మనము అంగీకరించవలసినదే.

మనము అంగీకరించవలెనని దేవుడు మనలను కోరుచున్న ఈ ప్రణాళిక ఏమైయున్నది? అది పెంతెకొస్తు దినాన ఏమైయుండినదో ఈ నాడు సహితము అదే ప్రణాళికయై యున్నది. ఆ దినాన సువార్త మొట్టమొదటిసారిగా పేతురు చేత ప్రకటింపబడింది: “మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” (అపొస్తలుల కార్యములు 2:38).

దేవుని ప్రణాళిక తన కృప చేత పురోగమించింది. మనము దానిని విశ్వాసముతో అనుసరించినప్పుడు మన జీవితాల్లో అదొక వాస్తవమౌతుంది.

2. దేవుని ఉద్దేశము (2:10). మనము దేవుని కృప యొక్క జయప్రద చిహ్నములుగా ప్రదర్శింపబడు ఆ సమయం కొరకు మనము వేచియుండు వ్యవధిలో, మనము చేయాల్సిందేమిటి? “వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసు నందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నాము” (2:10).

మనము మన సత్ క్రియలనుబట్టి రక్షింపబడలేదు. సంఘారాధనలకు హాజరగుట, ప్రతి ప్రభువు దినాన ప్రభురాత్రి భోజనంలో పాల్గొనుట, పది ఆజ్ఞలు పాటించుట, మంచి పొరుగువారమై యుండుట, నైతికముగా సదాచారమైనది మరియు గౌరవింపదగిన జీవితము జీవించుట, మొ॥ ఏవియు మనలను పరలోకమునకు తీసికొనివెళ్లవు.

ఏది ఏమైనా, మనము సత్ క్రియలు చేయనవసరము లేదని దేవుడు కోరుచున్నాడని దీని అర్థము కాదు. వాస్తవానికి, 10వ వచనం, మనము సత్ క్రియలు చేయుచున్నవారమై యుండుటకే దేవుడు మనలను కృప చేత రక్షించాడని మనకు ఉపదేశిస్తుంది. ఎఫెసీయులకు 4-6 అధ్యాయాల్లో, మన సమాజంలో మనము చచ్చినవారివలె ప్రవర్తించుట నుంచి మనలను ప్రత్యేకముగా ఉంచునవి, మనము చేయచుండవలసిన సత్ క్రియల గూర్చి పౌలు చెప్పుచున్నాడు. దేవుడు మనము నూతన జీవము నొసగినది మనము మనకిష్టము వచ్చినట్లు జీవించుటకు కాదు. మనము ఆయనకు మహిమ తెచ్చుటకే ఆయన మనకు నూతన జీవము ననుగ్రహించుచున్నాడు. మనము ఆయన కృప యొక్క జయప్రద చిహ్నములమై యుండుటయే ఆయన మనలను ఏర్పరచుకొన్న హేతువై యున్నది.

*ముగింపు.* చివరగా, ప్రతి ఒక్కరు ఎవరో మరొకరి జయప్రద చిహ్నమై యుందురు. దేవునికి విరోధముగా తిరుగుబాటు చేయుటలో నిమగ్నమై, పాపములో పడియుంటూ ఇహలోక జీవితమును చాలించుకొనువాడు, సాతాను కుతంత్రముల చిహ్నముగా

వాని నిత్యత్వమును నరకములో గడుపును. ఇందును తారతమ్యముగా, క్రీస్తు యెడల విశ్వాసముతో ప్రతిస్పందించువాడు దేవుని రక్షించు కృపకు ఒక నిత్య జయప్రద చిహ్నముగా నిలిచియుండును.

క్రిస్ బుల్లార్డ్

---

సూచనలు

[1]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Ephesians and Colossians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 65. [2]William Barclay, *More New Testament Words* (New York: Harper & Brothers, 1958), 11–24. [3]Ibid., 21. [4]Wuest, 66. [5]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament,* 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1992), 967. [6]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 110. [7]Ibid. [8]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 95. [9]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 511; కూడ చూడు Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 816–18.